ఆదర్శంగా మార్చాలని..



పాఠశాలలో పనులను గుర్తిస్తున్న అధికారులు

- స్కూళ్లలో వసతుల కల్పనకు శ్రీకారం
- అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు
- జిల్లా వ్యాప్తంగా 4,002 పనుల గుర్తింపు
- రూ. 31.49 కోట్లు నిధులు మంజూరు

జగిత్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ సర్కారు చర్యలు చేపట్టింది. గతంలో ఉన్న పాఠశాల యాజమాన్య కమిటీల పదవీ కాలం ముగియడంతో వాటి మహిళా సంఘాల సభ్యులతో అమ్మ ఆదర్శ కమిటీ లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్ప నకు పనులు చేయించేందుకు రూ. 31.49 కోట్ల నిధులను మంజూరు చేసింది. అయితే జిల్లాలోని 950 పాఠశాలలు ఉండగా గత ప్రభుత్వం 329 పాఠశాలల్లో మన ఊరు మన బడి పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టింది. కొన్ని పాఠశాలల్లో పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పటివరకు మౌలిక వసతులకు నోచుకోని 788 పాఠశాలలను ఎంపిక చేసిన కొత్త ప్రభుత్వం యూడైస్ ఆధారంగా అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వాటిని అభివృద్ధి చేసేందుకు పూనుకుంది.

● సిద్ధమైన కార్యాచరణ...

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వెంటనే పనులు చేపట్టేందుకు విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. ఇంజనీరింగ్ అధికారుల అంచనా మేరకు స్కూళ్లలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్ర శాలలు, తరగతి గదుల మరమ్మతులకు ప్రభుత్వం రూ. 31.49 కోట్లు మంజూరు చేసింది. మొదట తరగతి గదుల్లో విద్యుత్, మరుగు దొడ్లు, మూత్రశాలలు, బాలికల మూత్ర శాలలు, చిన్న, పెద్ద మరమ్మతులు, సానిటేషన్ నిర్వహణ, విద్యుత్ బిల్స్ తగ్గింపునకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు, యూనిఫాం స్టిచ్చింగ్ పనులు చేపట్టేందుకు 25 శాతం నిధులను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రతి మండలానికి నిర్ణీత మొత్తం చొప్పున నిధులను ఎంపీడీవోల ఖాతాల్లో జమ చేశారు. వాటిని అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాలో జమ చేయనున్నారు. ప్రతి పాఠశాలకు వసతుల కల్పనకు గరిష్ఠంగా రూ. 14 లక్షల వరకు, కనిష్ఠంగా రూ. 1.35 లక్షల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. అమ్మ ఆదర్శ కమిటీల తీర్మానం, కలెక్టర్ ఆదేశాలతో పనులు ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు.

● నిధులు విత్ డ్రా ఇలా..

పాఠశాలల పునఃప్రారంభమయ్యే నాటికి మౌలిక వసతులు కల్పించడానికి విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. పనులు ప్రారంభమైన తర్వాత డబ్బులు తీసుకోవడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు మహిళా సమాఖ్య అధ్యక్షురాలితో జాతీయ బ్యాంకులో ఖాతాలను ఇప్పటికే తెరిపించారు. రూ. 25 వేల లోపు విలువయిన పనులు చేసిన తర్వాత పాఠశాలల్లో కమిటీ సమావేశమై డబ్బులను విత్ డ్రా చేయనున్నారు. అదేవిధంగా రూ. లక్ష వరకు పనులకు ఎంపీడీవో అనుమతితో విత్ డ్రా చేయనున్నారు. రూ. లక్ష పైగా విలువైన పనులు చేస్తే జిల్లా సమాఖ్యతో పాటు కలెక్టర్ అనుమతి తీసుకొని విత్ డ్రా చేయనున్నారు. ఈ నిధుల వినియోగంపై కూడా అన్ని మండలాల్లో అమ్మ ఆదర్శ కమిటీలకు అవగాహన కల్పిస్తున్నారు. కమిటీల బాధ్యత, పనితీరు, పనుల నిర్వహణ తదితర అంశాలపై నిపుణులైన అధికారులచే పవర్ పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే...

- జగన్ మోహన్ రెడ్డి, జిల్లా విద్యాధికారి



ప్రభుత్వ పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి అవసరమైన కార్యాచరణను ప్రారంభించాము. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు, పనులు గుర్తింపు, నిధుల కేటాయింపు, పనుల ప్రారంభం తదితర వాటిని నిర్వహించడంపై దృష్టి సారించాము.

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్లు షురూ

● మొదటి రోజు రెండు నామినేషన్ల దాఖలు


నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద పోలీసు భద్రత

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వేలువడటంతో గురువారం నుంచి నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. నూతన సమీకృత కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల అధికారి, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. తొలిరోజు గురువారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రాపెల్లి సత్యనారాయణ, మరో స్వతంత్ర అభ్యర్థిగా జగిత్యాల జిల్లా రాయకల్ మండలం ఒడ్డెలింగాపూర్‌కు చెందిన బుక్యనంద్‌నాయక్‌లు నామినేషన్లను దాఖలు చేశారు. ఈనెల 25 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు.

● కలెక్టరేట్ వద్ద భారీ బందోబస్తు, తనిఖీలు

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నూతన కలెక్టరేట్ వద్ద నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కలెక్టరేట్‌లోకి ఎవరిని అనుమతించడం లేదు. గుర్తింపు కార్డులు ఉంటే తప్ప ఉద్యోగులను, ఇతరులను కలెక్టరేట్‌లోకి అనుమతించలేదు. ప్రతి వాహనాన్ని తనిఖీలు చేసి వివరాలు తీసుకున్న తర్వాతే పోలీసులు అనుమతించారు.

మోదీకీ మద్దతుగా నిలవండి

కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్ కుమార్

కొడిమ్యాల, ఏప్రిల్ 18 : పార్లమెంట్‌కు బీజేపీకి ఓటు వేసి మోదీకి మద్దతుగా నిలవాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని పద్మశాలీ సేవా సంఘ భవనంలో సంఘం నాయకులు, సభ్యులు, మండలంలోని వివిధ గ్రామాల కుల సంఘాల నాయకులు పలువురు సంజయ్ సమక్షంలో సుమారు 150 మంది బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికి అభ్యర్థి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి దొరకటం లేదన్నారు. టీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే లాభం ఎవ్వరికి అన్నారు. కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు ఇప్పటి వరకు అమలు చేయ లేదన్నారు. రైతులను మోసం చేయటానికె ఆగస్టులో రుణ మాఫీ చేస్తామనటం మోసం అన్నారు. తనకు ఓటు వేసి పార్లమెంటుకు పంపుతూ మోదీని మూడవ సారి ప్రధానిగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శోభ, అసెంబ్లీ కన్వీనర్ శ్రావణ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస యాదవ్, మండల బీజేపీ నాయకులు రాజేశం, అంజయ్య, నర్సింహరెడ్డి, రాజు, శ్రీనివాస్, చిరంజీవి, మహేందర్ పాల్గొన్నారు.

ముగిసిన సాయినామ సప్తాహ వేడుకలు

జగిత్యాల టౌన్, మార్చి 18 : జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో జరుగుతున్న సాయి సప్తాహ వేడుకలు గురువారంతో ఘనంగా ముగిశాయి. సాయిబాబా విగ్రహం ఎదుట 1,008 కలశాలు ఏర్పాటు చేసి వారం రోజుల పాటు మహిళలు, భక్తులు ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అంటూ ప్రత్యేక భజనలు నిర్వహించారు. వేద పండితులు నంబి వేణుగోపాలచార్య కౌశిక, విష్ణుశర్మ ఆధ్వర్యంలో మహిళలు, భక్తులు నెత్తిన ఎత్తుకుని వచ్చిన కలశాలతో సాయిబాబా విగ్రహానికి సహస్ర(1,008) కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు డాక్టర్ సతీష్‌కుమార్, నాగుల కిషన్ గౌడ్, సత్యనారాయణ, కైలాసం, రాజు, రాంచంద్రం, రవి చంద్ర ఉన్నారు.

డాక్టరేట్ అందుకున్న హిమ్మతురావుపేట వాసి

కొడిమ్యాల, ఏప్రిల్ 18 : మండలంలోని హిమ్మతురావుపేట గ్రామానికి చెందిన పల్లెర్ల చిరంజీవి గురువారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆస్ట్రోనామీ సబ్జెక్ట్‌లో డాక్టరేట్ అందుకున్నాడు. ఈ సందర్భంగా చిరంజీవి విలేకరులతో మాట్లాడుతూ ఎక్స్ రే టైమింగ్ అండ్ స్పెక్ట్రల్ స్టడీస్ ఆఫ్‌లో మాస్ ఎక్స్ రే బైనరీస్‌యూజింగ్ ఆఫ్ ఆస్ట్రోసాట్ సాటిలైట్ అనే అంశంపై పరిశోధన చేసినట్లు తెలిపారు. డా.. కె. శ్రీరాం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశానన్నారు. డా.. కె. శ్రీరాంకు, సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

బీడు భూములు సస్యశ్యామలం చేస్తాం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి, ఏప్రిల్ 18: గోదావరి జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ గార్డెన్స్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన గోదావరి ఎత్తిపోతల పథకాలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎత్తిపోతల పథకాలు గురించి పట్టించుకోలేన్నారు. ధర్మపురి నియోజక వర్గంలో సాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఇందుకు గత ప్రభుత్వమే కారణమన్నారు. రాబోయే ఆరు నెలల కాలంలో గోదావరి ఎత్తి పోతల పథకాలకు మరమ్మతు పనులు చేయించి సాగు నీరందిస్తామన్నారు. పత్తిపాక రిజర్వాయర్ పనులు పూర్తి స్థాయిలో చేపట్టి ఈ ప్రాంతానికి సాగు నీరం దిస్తామన్నారు. కొప్పుల ఈశ్వర్ పార్లమెంట్ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. గడ్డం వంశీకృష్ణ మంచి సేవాభావం కలిగి ఉన్న వ్యక్తి అన్నారు. వంశీకృష్ణ గెలుపు కోసం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు కృషి చేయాలని అన్నారు. వంశీకృష్ణను ఇక్కడి ప్రజలు భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ, నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ ఎన్నికల బరిలోకి దిగి తాను పద్మవ్యూహంలోకి ప్రవేశించానని, తనను అభిమన్యుడిని చేస్తారో, లేక అర్జునిడిని చేస్తారో మీ ఇష్టమని అన్నారు. తనకు పద్మవ్యూహంలోకి వెళ్లడం మాత్రమే తెలుసునని బయటకు తీసుకురావాల్సిన బాధ్యత మంత్రి శ్రీధర్‌బాబుదేనన్నారు. ఎంపీగా తనను గెలిపించే బాధ్యత తీసుకోవాలని శ్రీధర్‌బాబును కోరారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయ నేపథ్యం కలిగి ఉన్న వివేకానంద తనయుడు గడ్డం వంశీకృష్ణ రాజకీయాల్లోకి రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అన్నారు. వంశీకృష్ణను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ వస్తే ఏదో జరుగుతుందనే ప్రజల ఆశలు నీరు గారి పోయాయన్నారు. కేసీఆర్ పది ఏళ్ల పాలనలో నిరుద్యోగ సమస్య పెరిగి, ఉద్యోగాలు లేక అవస్థలకు గురయ్యారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని వంశీకృష్ణ కోరారు. అనంతరం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడారు. చివరగా పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఈ సమావేశంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి నర్సయ్య, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, పెగడపల్లి జడ్పీటీసీ నియోజకవర్గ స్థాయి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముస్కు నిశాంత్‌రెడ్డి, తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, వేముల సుభాష్, రాములు గౌడ్, గాదిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి


పార్టీలో చేరిన నాయకులతో జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18: యుద్ధం గెలిచేందుకు యువతకు ఆయుధమవుతానని నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా యువత పనిచేయాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో గురువారం జగిత్యాల నియోజకవర్గ యువకులతో సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సి విధానాలపై చర్చించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రల్లోకి తీసుకవెళ్లి ప్రత్యర్థి పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. గల్ఫ్ కార్మికుల పిల్లలకు విద్య, ఉపాధి రంగాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖరీఫ్ పంట నాటికి రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామన్నారు. బీడీలు చుట్టే ప్రతి ఒక్కరికి పించన్ అందిస్తామని వివరించారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు వ్యతిరేఖంగా కరీంనగర్ పార్లమెంట్‌కు పోటీ చేశానని గుర్తు చేశారు. నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ భూములను సంరక్షించడంతోనే నేడు నడిబొడ్డున కలెక్టరేట్ నిర్మించుకున్నామన్నారు. జగిత్యాలలో అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను కాపాడిన విషయం అర్వింద్‌కు తెలుసా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో యువజన విభాగం నాయకులు ఉన్నారు. అలాగే సారంగాపూర్ మండలం రేచపల్లి మాజీ సర్పంచ్ ఎడమల జయ లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగా జీవన్ రెడ్డి కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు శైలేందర్‌రెడ్డి, భూక్య సరళ, బేర మహేష్, హరీష్ ఉన్నారు. అనంతరం పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్‌లో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. జీవన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు జున్ను రాజేందర్, శ్రీరాముల గంగాధర్, గాజెంగి నందయ్య, రమేష్ బాబు, గంగాధర్, శ్రీనివాసరెడ్డి, మహేష్, దశరథరెడ్డి, రాదాకిషన్‌రావు, గంగాధర్, రాములు, దామోదర్ రెడ్డి, రవీందర్ రెడ్డి ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల సత్తా చూపిస్తాం

ధర్మపురి, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగల సత్తా ఏమిటో చూపిస్తామని అంబేడ్కర్ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్కల గంగారాం అన్నారు. ధర్మపురి పట్టణంలోని శ్రీ కర్నె అక్కపెల్లి కళ్యాణ మండపంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. గంగారం మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షలు మాదిగలు ఉన్న జాతికి పార్లమెంట్‌కు వెళ్లడానికి అవకాశం ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. ఒక్క సీటు కూడ ఇవ్వని రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేస్తామనడం నమ్మడానికి మాదిగలు అమాయకులు కాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో గజ్జెల కాంతం, పిడమర్తి రవి, రాదిక, ప్రసాద్ వీరికి అర్హత లేదా, కేవలం మాదిగలు అనే టిక్కెట్ ఇవ్వలేదన్నారు. మాదిగలు ఏకమై ఉద్యమం చేపట్టి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం చేద్దామన్నారు. అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హన్మండ్లు, అవునూరి శ్రీకాంత్, సత్తయ్య పాల్గొన్నారు.

రాములవారి రథోత్సవం

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 18 : జగిత్యాల రూరల్ మండలంలోని సోమన్‌పల్లి గ్రామంలో గురువారం సీతారాముల రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రాములవారి రథోత్సవాన్ని గ్రామపుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవంలో హన్‌మాన్‌స్వాములు, గ్రామస్థులు పాల్గొని విజయవంతం చేశారు. స్వామి వారికి మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు.

గైడియల్ ఒలింపియాడ్ పరీక్షలో జ్యోతి విద్యార్థుల ప్రతిభ



విద్యారులతో పాఠశాల నిర్వాహకుడు హరిచరణ్ రావు

జగిత్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్ట ణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన గైడియల్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను గురువారం పాఠశాల నిర్వాహకులు అభినందించారు. 6వ తరగతి విద్యార్థి పి అనిరుద్ గైడియల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు, 7వ తరగతి విద్యార్థి సుబి య అప్రొగైడియల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో జిల్లా స్థాయిలో 1వ ర్యాంకు, 7వ తరగతి విద్యార్థి సీహెచ్ కీర్తన గైడియల్ మాథ్స్ ఒలింపియాడ్‌లో జిల్లా స్థాయిలో 4వ ర్యాంకును సాధించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు సన్మానించారు. యాజమాన్యం శ్రీధర్ రావు పాల్గొన్నారు.

ధర్మపురి సమావేశానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

పెగడపల్లి, ఏప్రిల్ 18 : ధర్మపురిలో గురువారం నిర్వహించిన పెద్దపల్లి పార్లమెంట్ సన్నాహక సమావేశానికి పెగడపల్లి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని 23 గ్రామాల నుండి ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాల ద్వారా పార్టీ నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు దాదాపు వెయ్యి మంది తరలివెళ్లినట్లు పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్ తెలిపారు.

రూ.7,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 18: జమ్మికుంట వ్యవసా య మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 457క్వింటాళ్ల విడి పత్తి, ఒక రైతు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,300, కనిష్ఠ ధర 6వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

హుజూరాబాద్, ఏప్రిల్ 18: పట్టణంలోని వరంగల్ రోడ్డులోని పరకాల క్రాస్ రోడ్డు వద్ద ఈ నెల 10న చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుబడ్డ రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. వాహన తనిఖీల్లో హనుమకొండ జిల్లా పరకాలలోని ఓ రైస్ మిల్లు నుంచి గుజరాత్‌కు ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 350 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. పట్టుబడిన బియ్యాన్ని ల్యాబ్‌కు పంపించగా గురువారం రేషన్ బియ్యంగా అధికారులు గుర్తించారు. బియ్యం తరలిస్తు న్న ఇద్దరిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డీటీలు వినోద్, వసంతరావు తెలిపారు.



పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో గుండవేణి చిన్నక్క (98) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు చేదబావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గుండవేణి చిన్నక్క బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంటి సమీపంలో కూర్చొని ముచ్చటించుకుటున్న సమయంలో ఆరుబయటకు వచ్చింది. చిన్నక్కకు సరిగా కళ్లు కనబడక పోవడంతో ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికుల సహాయంలో కుటుంబ సభ్యులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ లాభం లేకుండా పోయినట్లు బంధువులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. చిన్నక్క కుమారుడు రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని గుమ్లాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి గ్రామానికి చెందిన అడ్లగట్ల రాజేశం (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశం కొన్ని రోజులగా మతిస్థిమితం లేక తిరుతుండే వాడని తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉదయం ఇంటి నుంచి వెళ్లి ఇంటికి రాలేదని తెలిపారు. స్థానిక రైతులు గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. గ్రామానికి చెందిన అడ్లగట్ల రాజేశంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అడ్లగట్ల రాజేశం భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18: కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన గంటల మనీష్‌రెడ్డి(31) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గంటల గోపాల్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొంది ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. చిన్న కొడుకు మనీష్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా వర్క్‌ఫ్రం హోంగా పనిచేస్తున్నాడు. మనీష్‌రెడ్డి తల్లికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఆమెతోపాటు గోపాల్‌రెడ్డి బుధవారం ఉదయం 6 గంటలకు వరంగల్‌కు వెళ్లారు. ఆ రోజు మధ్యాహ్నం మనీష్‌రెడ్డి సమీపంలోని తన పెదనాన్న ఇంటి వద్ద భోజనం చేసి తిరిగి ఇంటికి వచ్చాడు. గురువారం 12 గంటలకు వరంగల్ నుంచి తిరిగి వచ్చిన గోపాల్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఉండటంతో తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. ఇంట్లో మనీష్‌రెడ్డి మృతదేహం ఉరికి వేళాడుతూ కనిపించింది. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, తనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని ఒక సూసైడ్ లెటర్ టేబుల్‌పై ఉన్నట్లు గుర్తించారు. తన కొడుకు కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఉన్నాడని ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి గోపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

హార్వెస్టర్‌లో ఇరుక్కుని తెగిన చేయి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 18: రైతు హార్వెస్టర్ ద్వారా పొలం కోస్తుండగా ప్రమాదవశాత్తు హార్వెస్టర్‌లో చెయ్యి ఇరుక్కుని తెగిపోయిన సంఘటన మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వంగల సదాశివరెడ్డి గురువారం పొలం కోస్తూ వరి గొలుసులు హార్వెస్టర్‌లో వేస్తుండగా ప్రమాదవశాత్తు కుడి చేయి హార్వెస్టర్‌లో ఇరుక్కుని తెగిపోయింది. తోటి రైతులు వెంటనే తెగిన కుడిచేయితో పాటు గాయాలపాలైన సదాశివరెడ్డిని మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు.

ఐదుగురు రౌడీషీటర్ల బైండోవర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యగా ఐదుగురు రౌడీషీటర్లను తహసీల్దార్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేశామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన రౌడీషీటర్లు హస్తపురం విష్ణు, హస్తపురం ఆంజనేయులు, మేక శివకుమార్, హస్తపురం పవన్ కుమార్, హస్తపురం వంశీలను బైండోవర్ చేశామని పోలీసులు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై కేసు నమోదు

గంభీరావుపేట, ఏప్రిల్ 18: బీఆర్‌ఎస్ నాయకుడు కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. కమలాకర్‌రెడ్డి తన భూమి కాకున్నా తనసొంత భూమి అని చెప్పి దుబ్బాక మండలం నగరం గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తికి అమ్మాడని ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు. మొదటి కిస్తీ కింద భూమి కొనుగోలు చేసిన రాములు కమలాకర్‌రెడ్డికి 2 లక్షల రూపాయలు కూడా ఇచ్చాడన్నారు. ఆ భూమి కమలాకర్‌రెడ్డికి కాదని తెలిసి రాములు తాను ఇచ్చిన డబ్బులు వాపస్ ఇవ్వమని అడిగితే కమలాకర్‌రెడ్డి ఇవ్వడం లేదని రాములు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. రాములు ఫిర్యాదు మేరకు కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే అదే భూమికి సంబంధించి కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు అయినట్టు, బాధితులు ఇంకెవరైనా ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ రాంమోహన్ సూచించారు.

లేగదూడలపై కుక్కల దాడి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 18: మండలంలోని పెగడపల్లిలో గురువారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. దారివెంట వెళ్లే వారిపై దాడిచేయడంతోపాటు ఇళ్ల వద్ద కట్టేసిన లేగదూడలపై దాడి చేశాయి. దీంతో గ్రామస్థులు కుక్కలను కర్రలతో తరిమివేశారు. గ్రామంలో కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గంభీరావుపేట, ఏప్రిల్ 18: గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు తనిఖీ చేయగా, ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కన్పించారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని 4,360 రూపాయలను, ఐదు సెల్‌ఫోన్లు, మూడు బైకులను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

రుద్రంగి మార్చి 18: అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల ఎస్సై అశోక్ తెలిపారు. రుద్రంగి మండలం అడ్డబోరు తండా గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు మంగళవారం రాత్రి గస్తీ నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో అడ్డబోరు తండా గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, వాచర్ రాజుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు రాళ్లతో దాడి చేశారు. దీంతో బాలకృష్ణ, రాజులకు గాయాలు అయ్యాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల ఎస్సై అశోక్ తెలిపారు.

మృతదేహం గుర్తింపు

ఏసీసీ, ఏప్రిల్ 18: మంచిర్యాల బస్టాండ్ ఆవరణలో ఈ నెల 16న రాత్రి మృతదేహం ఆచూకీ గుర్తించినట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేట్ గ్రామానికి చెందిన కొమ్ము రాజేందర్ (33) మంచిర్యాలలోని స్నేహితున్ని కలవడానికి వచ్చి వడదెబ్బ తగిలి మృతిచెందాడన్నారు. వ్యవసాయం చేసి జీవించే రాజేందర్ అవివాహితుడని తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి బాలిక మృతి

వీణవంక, ఏప్రిల్ 18: వీణవంక మండలంలోని గంగారం గ్రామంలో గురువారం వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి దేవరకొండ పార్వతి (13) అనే బాలిక మృతి చెందింది. నెల్లూరు జిల్లా కందుకూరు గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీనివాస్ బాతులు పెంచుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం యాసంగి కోతలు ఉన్నందున నెల రోజుల క్రితం గంగారం గ్రామానికి కుటుంబంతో సహ వచ్చాడు. బాతులను పొలాల్లో మేతకు తీసుకెళుతున్నారు. గురువారం బాతులను కుటుంబ సభ్యులు మేతకు తీసుకెళ్లారు. ఆ సమయంలో పార్వతికి దాహం వేయడంతో గంగారం గ్రామంలోని గూడేపు తిరుపతిరెడ్డి వ్యవసాయ బావిలో నీరు తాగేందుకు దిగింది. ఈ క్రమంలో పార్వతి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై తోట తిరుపతి కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొడిమ్యాల, ఏప్రిల్ 18: మండలంలోని నల్లగొండ శివారులో మామిడి తోట పక్కన గుట్టపైన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండి నీలి రంగు జీన్ ప్యాంట్, మెడలో మల్లన్న స్వామి తాడు ధరించిన పురుష మృతదేహం ఉందని గ్రామ ప్రత్యేక అధికారి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సుప్రీంకోర్టును అవమానించేలా మంత్రి పొన్నం వ్యాఖ్యలు

● బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 18: సుప్రీంకోర్టును అవమానించేలా మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు ఉన్నాయని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాం నిందితుడు, వ్యాపార వేత్త శరత్‌చంద్రారెడ్డి బీజేపీకి 500 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌లు ఇవ్వగానే బెయిల్ వచ్చిందంటూ మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పొన్నం వ్యాఖ్యలను న్యాయస్థానం సుమోటాగా తీసుకుని ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్టోరల్ బాండ్స్‌కు, బెయిల్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో ఏ సర్వేలు చూసినా బీజేపీకి 400 సీట్లు వస్తాయని తేలడంతో కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ జాతీయ పార్టీలతో పాటు స్థానిక పార్టీలకు సైతం వచ్చాయన్నారు. రాష్ట్రంలో బండి సంజయ్ పోరాటంతోనే కేసీఆర్‌పై వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారన్నారు. అంతే తప్ప పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఏనాడూ పోరాటం చేయలేదన్నారు. కరీంనగర్ ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్ 5 లక్షల మెజారిటీతో గెలువబోతున్నారని తేలడంతో పొన్నంకు భయం పట్టుకుందని కుమార్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప మాట్లాడుతూ పొన్నం మంత్రి కాగానే తన స్థాయిని తానే తగ్గించుకునేలా మాట్లాడుతున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

కరీంనగర్‌లో ప్రజల్లో స్థానం లేదని పొన్నం అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ పారిపోయాడన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్ మాట్లాడుతూ బండి సంజయ్ చేసిన పోరాటాలతోనే కేసీఆర్ సర్కార్‌ను ప్రజలు గద్దె దించారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కుమ్మరి శంకర్, కరండ్ల మధూకర్, రమణారెడ్డి, సొల్లు అజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

- ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

మానకొండూర్, ఏప్రిల్ 18: మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వద్ద బుధవారం మృతి చెందిన వ్యక్తి ఆచూకీ గురువారం లభ్యమైంది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా దొనకొండ మండలం భూమనపల్లి గ్రామానికి చెందిన మురికిపూడి చెన్నయ్య (36) అనే వ్యక్తి మేస్త్రీ పని నిమిత్తం శ్రీను అనే కాంట్రాక్టర్ వద్దకు కరీంనగర్‌కు వచ్చాడు. మద్యానికి బానిసైన చెన్నయ్య ఈ నెల 14నుంచి పనికి వెళ్లలేదు. బుధవారం మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వద్ద స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గురువారం చెన్నయ్య కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చెన్నయ్య వడదెబ్బతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

సాయ్ క్రీడా హాస్టల్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాండ్ బాల్ క్రీడా హాస్టల్‌కు ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెలలో జరిగిన సాయ్ హ్యాండ్ బాల్ ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎం.సంజీవ్ (రామడుగు), ఎన్. ఈశ్వర్ (కాటారం), ఎం.చంటి, బి.దేవేందర్ (గుల్లకోట), బి.వంశీ (గుల్లకోట) ప్రతిభ చాటి క్రీడా హాస్టల్‌కు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని సంఘం సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 18 : శంకరపట్నం మండలానికి చెందిన శ్రీనివాస్ గురువారం కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళుతుండగా కరీంనగర్ లేక్ అవుట్‌పోస్ట్ పోలీసులు రక్షించారు. శ్రీనివాస్ కుటుంబ సమస్యలతో గురువారం మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తుండగా లేక్ పోలీసులు అనుమానించి అతడిని అడ్డుకున్నారు. కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంజన్న దీక్షాపరుడిపై ఆంక్షలు

● ఉద్యోగం నుంచి తొలగించిన ఓ ప్రైవేటు సంస్థ మేనేజర్ ● అంజన్న స్వాముల ఆందోళన

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆంజనేయ స్వామి మాల ధరించి విధులకు హాజరవుతున్న ఓ ప్రైవేటు ఉద్యోగి పట్ల మరో ఉద్యోగి ఆంక్షలు విధించాడు. నిబంధనల ప్రకారం బూట్లు వేసుకుని విధులకు హాజరు కావాలని లేకుంటే రావద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశాడు. మధ్నాహ్నం సమయంలో భిక్ష(భోజనానికి)కు అరగంట మాత్రమే సమయమంటూ వేధించాడు. అంతే కాకుండా అసభ్యకరంగా మాట్లాడుతూ ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. టూల్ కిట్ తీసువచ్చేంత వరకు ద్విచక్రవాహనం ఇవ్వనని దాన్ని స్వాధీనం చేసుకుని ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో దీక్షాపరుడు జరిగిన విషయాన్ని వీహెచ్‌పీ, బీజేపీ, అంజన్న దీక్షాపరులకు తెలియజేశాడు. వారు ఆందోళన చేపట్టగా పోలీసులు రంగప్రవేశం చేసి బాధితుడికి సారీ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావు పేట గ్రామానికి చెందిన రుద్రారపు నవీన్ అనే యువకుడు జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న జియో ఫైబర్ నెట్‌వర్క్ సర్వీసర్‌గా మూడు నెలలుగా విధులు నిర్వహిస్తున్నాడు. నవీన్ ఆరు రోజుల క్రితం అంజన్న దీక్ష తీసుకుని విధులకు హాజరవుతున్నాడు. అప్పటి నుంచి కంపెనీ మేనేజర్ సురేష్ అసభ్యకరంగా మాట్లాడుతూ అవమానిస్తున్నాడు. మాల ధరించి విధులకు హాజరు కావద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశాడు, కంపెనీ నిబంధనల ప్రకారం షూ వేసుకుని రావాలని, భిక్షకు కేవలం అరగంట సమయం మాత్రమే తీసుకోవాలంటూ ఆంక్షలు విధించాడు. శ్రీరామనవమి రోజున సదరు మేనేజర్ నవీన్‌పై ఉన్న కోపంతో ఉద్యోగం నుంచి తొలగిస్తున్నానని తెలుపడంతో పాటు కంపెనీ టూల్ కిట్ ఇచ్చేంత వరకు ద్విచక్రవాహనాన్ని ఇచ్చేది లేదంటూ



జగిత్యాలలో ధర్నా నిర్వహిస్తున్న అంజన్న స్వాములు

వాగ్వాదానికి దిగాడు. గురువారం నవీన్ అంజన్న భక్తులతో పాటు వీహెచ్‌పీ, బీజేపీ నాయకులకు విషయం తెలిపాడు. ఆగ్రహంతో వారందరూ జియో షోరూం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. మేనేజర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి నాలుగు గంటల అనంతరం మేనేజర్‌తో సారీ చెప్పించడంతో అంజన్న భక్తులు ఆందోళనను విరమించారు. జగిత్యాలలో అంజన్న భక్తుడిని అవమానించిన ఘటనను తెలుసుకున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్ బాధితునితో ఫోన్లో మాట్లాడి ధైర్యం నింపారు. ముంబైలో ఉన్న కంపెనీ యజమానికి ఫోన్ చేసి తిరిగి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి కట్టడికి కఠిన చర్యలు

● ఖని ఏసీపీ మడక రమేష్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 18: గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో గంజాయి కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఏసీపీ మడక రమేష్ తెలిపారు. గురువారం గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టూటౌన్, కమాన్‌పూర్ స్టేషన్‌ల పరిధిలో ఈ నెలలో మూడు కేసులు నమోదు చేసి 17 మందిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. వారి వద్ద నుంచి 85,675 విలువ గల 3 కిలోల గంజాయితో పాటు ఒక బైక్, 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. అరెస్టు అయిన 17 మందిలో వారిలో 9 మంది అమ్మకం దారులు, నలుగురు వినియోగదారులు, ఇద్దరు డీలర్లు, ఒకరు కొరియర్, ఒకరు గంజాయి పండించే వ్యక్తి ఉన్నట్టు ఏసీపీ పేర్కొన్నారు. వీరంతా కమాన్‌పూర్, జూలపల్లి, గోదావరిఖని, సెంటినరీ కాలనీ, మచ్చుపేట, గుంటూరుపల్లెకు చెందిన వారని అన్నారు. పారిశ్రామిక ప్రాంతానికి గంజాయి తీసుకువస్తున్న ముఖ్యమైన వ్యక్తి గొడిశెల శివ(రూట్ శివ)ను అదుపులోకి తీసుకుని విచారించిన మీదట, ఆదిలాబాద్ జిల్లా గడెగూడ మండలం లోకారి గ్రామంలో గంజాయి పండిస్తున్న నాగోరావ్‌ను అరెస్ట్ చేసినట్టు ఏసీపీ తెలిపారు. గొడిశెల శివ, నాగోరావ్‌లను రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన ఎస్సైలు సనత్‌కుమార్,



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ రమేష్

వెంకటేష్, కానిస్టేబుళ్ల కృష్ణారెడ్డి, జే రమేష్, వెంకటస్వామి, రామచంద్రంలకు ఏసీపీ అవార్డులను అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోస్టర్‌ను ఏసీపీ రమేష్ ఆవిష్కరించారు. గంజాయి, కల్తీ కల్లు అమ్మకాలపై టోల్ ఫ్రీ నంబర్ 8712671111 లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈవిలేకరుల సమావేశంలో సీఐ బీ రవీందర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 18 : కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని డిల్లీ దాబా వద్ద రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి(55) మృతి చెంది ఉన్నాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించినవారు ఏఎస్‌ఐ చాంద్‌పాషా ఫోన్ నెంబరు 99084 40822, ఒకటో ఠాణా ఫోన్ నెంబరు 8331940591కు సమాచారం అందించాలని కోరారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు

గొల్లపల్లి, ఏప్రిల్ 18 : గొల్లపల్లి మండల కేంద్రంలోని రామాలయంలో జరుగుతున్న శ్రీ కళ్యాణ రామచంద్ర స్వామి 33వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 24 ఎడ్ల బండ్లు పోటీలో నువ్వా.నేనా అన్న రీతిలో చెమటోడ్చాయి. వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట గ్రామానికి చెందిన క్యాతం జితేందర్‌కు చెందిన ఎడ్లబండి ప్రథమ విజేతగా నిలిచింది. ద్వితీయ విజేతగా వెన్నమట్ల గ్రామానికి చెందిన నేరేళ్ల సతీష్‌గౌడ్ నిలిచారు. తృతీయ విజేతగా గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ భాషామియా ఎడ్లబండి నిలిచింది.

వడదెబ్బతో ఒకరి మృతి



గంగారాం (ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 18: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో వడదెబ్బతో ఒకరు మృతి చెందారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మట్కం గంగారం (42) అనే వ్యక్తి గురువారం చందుర్తి మండల కేంద్రంలో పనిపై ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి గ్రామ శివారులోని మామిడి తోట వద్దకు చేరుకొని విశ్రాంతి తీసుకుంటుండగా అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు వెంటనే ద్విచక్ర వాహనంపై ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గంగారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తుర్తి గ్రామం నుంచి జీవనోపాధి కోసం 20 సంవత్సరాల క్రితం గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. మృతుడికి భార్య సరోజన, కూతురు ఒక కుమారుడు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్థులు అంత్యక్రియల కోసం విరాళాలు సేకరించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ



ఆది శ్రీనివాస్ వాహనంను తనిఖీ చేస్తున్న పోలీసులు

బోయినపల్లి, ఏప్రిల్ 18: హుజూరాబాద్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ముగించుకొని వేములవాడ వస్తున్న క్రమంలో గురువారం కొదురుపాక చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వారికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకరించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

కోనరావుపేట, ఫిబ్రవరి 18: మండలంలోని మల్కపేట గుట్టపై నిర్మించిన కోదండరామస్వామి నూతన ఆలయ ప్రాంగణంలో గురువారం నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం చిన్నజీయర్ స్వామి చేతులమీదుగా ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, చల్మెడ లక్ష్మీనర్సింహారావు తెలిపారు.

అంజన్న భక్తుల కోసం రోడ్డుపై గడ్డితో నడకదారి

మల్యాల, ఏప్రిల్ 18: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగనున్న చిన్నహనుమాన్ జయంత్యుత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి నడిచి వచ్చే వేలాది మంది దీక్షాపరుల కోసం మండలంలోని నూకపల్లికి చెందిన యువకులు రహదారి పక్కన వరిగ్రాసంతో నడకమార్గం ఏర్పాటు చేస్తున్నారు. వేసవి ఎండలు మండి పోతుండడం.. రహదారిపై నడిచే భక్తుల కాళ్లకు బొబ్బలు రావడంతో వరిగ్రాసాన్ని రహదారి పక్కన పేర్చుతూ మార్గం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వీఆర్‌కే కళాశాల నుంచి మల్యాల క్రాస్‌రోడ్డు వరకు వరి గ్రాసంతో నూకపల్లికి చెందిన ఆర్మీ శ్రీనివాస్, చందు, స్వామి, జగదీష్, మనీష్, నాంపల్లి, ఆంజనేయులు నడక మార్గం ఏర్పాటు చేస్తుండగా వరి గ్రాసంను కనకట్ల శ్రీనివాస్ సమకూర్చాడు. వరి గడ్డి గాలికి కొట్టుకుపోకుండా దానిపై నీరు చల్లుతున్నారు.



అంజన్న స్వాములు నడిచేందుకు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన గడ్డి

విధుల్లో అలసత్వం వహించిన పోలీసుల సస్పెన్షన్

సారంగాపూర్, ఏప్రిల్, 18: విధుల్లో అలసత్వం వహించినందుకు ఇద్దరు ఎస్‌ఐలతో పాటు హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీసులు గత సంవత్సరం ఫిబ్రవరిలో వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 70 కిలోల గంజాయిని సారంగాపూర్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో ఉంచి పోలీస్‌స్టేషన్లో ఎస్సై రూమ్ సమీపంలో భద్రపరిచారు. కొద్ది రోజుల క్రితం అంబులెన్స్‌లో ఉన్న గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీన్ని గమనించిన పోలీసులు ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపారు. హుటాహుటిన ఎస్పీతో పాటు జిల్లా స్థాయి పోలీస్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేశారు. విధుల్లో అలసత్వం వహించిన అప్పటి ఎస్సై మనోహర్ రావు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్సై తిరుపతితో పాటు హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ టీ నరేందర్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ 1 ఐజీ ఎవి రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం వితరణ

వేములవాడ టౌన్, ఏప్రిల్ 18: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి తిప్పాపూర్ గోశాలకు పలువురు పశుగ్రాసాన్ని గురువారం అందజేశారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన రాజే 1000 కేజీల గ్రాసం అందించగా, వెంకటాపురం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి 17 వందల కేజీల గ్రాసాన్ని సంబంధిత అధికారులకు అందించారు. అంతే కాకుండా శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు పశుగ్రాసం అందించాల్సిన దాతలు నాంపల్లి గుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన 3వ గోశాలకు తీసుకురావల్సిందిగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

నిలిపి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● 12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు

గంగాధర, ఏప్రిల్ 18: గంగాధర మండలం కురిక్యాల గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం అర్ధరాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై నిలిపి ఉంచిన వ్యాన్‌ను వెనకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్ సహ మరో పది మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల డిపోకు చెందిన బస్సు(టీఎస్ 21జడ్ 0011) భద్రాచలం నుంచి కోరుట్లకు వెళ్తోంది. గంగాధర మండలం కురిక్యాల శివారు నుంచి సుమారు రాత్రి రెండు గంటల ప్రాంతంలో బస్సు వెళుతున్నది. ఆ సమయంలో ప్రధాన రహదారిపై నిలిపి ఉంచిన వ్యాను (ఎంపీ 13జీబీ 4566)ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీంతో బస్సు డ్రైవర్ మహేందర్, కండక్టర్ గంగారాంతో పాటు 10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌రెడ్డి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని కరీంనగర్‌కు తరలించారు. కోరుట్ల డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేరుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వ్యాన్‌ను డ్రైవర్ ఇండికేటర్స్ వేయకుండా రోడ్డుపై నిలిపి ఉంచడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు.



వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 18 : గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్ పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని ఏఎస్‌ఆర్‌తండా గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన గుగులోతు గంగా దాస్ పేకాట ఆడిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేపట్టినట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న అయిదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో 9 మంది పరారైనట్లు తెలిపారు. పట్టుకున్న వారి వద్ద నుంచి రూ. 8వేల నగదు, ఐదు సెల్ ఫోన్లు, 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం తెలిపాలని, తెలిపిన వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో కానిస్టేబుల్ మహేందర్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా పోతాని రవి



బాధ్యతలు తీసుకుంటున్న రవి

మల్యాల, ఏప్రిల్ 18: మల్యాల ఇన్‌చార్జీ ఎంపీపీగా వైస్ ఎంపీపీ పోతాని రవి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎంపీపీ మిట్టపెల్లి విమలపై ఈ నెల 2న సభ్యులు అవిశ్వాసం ప్రకటించడంతో వైస్ ఎంపీపీ రవిని ఇన్ చార్జీ ఎంపీపీగా నియమించారు. దీంతో మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో అధికారులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతి నిధులు, నాయకుల సమక్షంలో పోతాని రవి ఇన్‌చార్జీ ఎంపీపీగా పదవి బాధ్యతలు చేపట్టాడు. అనంతరం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పలువురు అభినందించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మరాఠి సంజన, దొంగ అనిత, కొల్లూరి గంగాధర్, ముదుగంటి వనితతో పాటు నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వంశీధర్, భూపతిరెడ్డి, వలీ, రాజు, అరుణ్‌రావు పాల్గొన్నారు. నూ తన ఎంపీపీ ఎన్నిక అయ్యే వరకు రవి ఇన్‌చార్జీ ఎంపీపీగా కొనసాగనున్నారు.

ప్రయోగాలు పర్యవేక్షకుల సమక్షంలో జరగాలి

రాష్ట్ర అర్థగుణాంకల ఉపసంచాలకులు మోహన్‌రెడ్డి



మేడిపల్లిలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న ఉపసంచాలకులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 18 : పంట సాగులో చేపట్టే ప్రయోగాలు పర్యవేక్షకుల సమక్షంలో జరగాలని రాష్ట్ర అర్థగుణాంకల ఉపసంచాలకులు మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన వరి క్షేత్రంలో రాష్ట్ర అర్థగుణాంకల ఉపసంచాలకులు హైదరాబాద్ వారి సమక్షంలో వరి కోత ప్రయోగాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి మనోజ్ఞ చేపట్టారు. పంట కోత ప్రయోగంలో పావు గుంట విస్తీర్ణంలో 18.950కిలోల దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ఇలాంటి పంట కోత ప్రయోగాలు రాష్ట్రం అంతట నిర్వహిస్తామన్నారు. దీంతో రాష్ట్రంలో పంట దిగుబడి అంచనా వేయడం సునాయాసంగా వీలువుతుందన్నారు. పంట కోత ప్రయోగాన్ని చేపట్టిన వ్యవసాయాధికారి మనోజ్ఞను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గణాంక అధికారులు మల్లేశం, శ్యామ్ సుందర్, నాగేష్, రామకృష్ణ, మధు, రైతులు, పాల్గొన్నారు.

మైతాపూర్ బీజేపీ అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్

రాయికల్, ఏప్రిల్ 18: మండలంలోని మైతాపూర్ బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మోత్కూరి శ్రీనివాస్ గౌడ్‌ను గురువారం నియమించినట్లు మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, యువమోర్చా అధ్యక్షుడు రాజనాల మధు కుమార్ తెలిపారు. అలాగే గ్రామ యువమోర్చా అధ్యక్షుడిగా పడిగెల హరీష్, ప్రధాన కార్యదర్శిగా నాగిరెడ్డి సంతోష్‌రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా వేల్పుల మహేష్, కోశాధికారిగా గంగుల భూమేష్, కార్యదర్శులుగా కాలగిరి రాజారెడ్డి, భూపెల్లి రమేష్, గౌరవాధ్యక్షుడిగా సద్ది మహిపాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షురాలిగా దుంపల లలిత, గౌరవ సలహాదారులుగా క్యాసనూరి జగదీశ్వర్ నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పాలడుగు లింగా రెడ్డి, కండ్లపెల్లి ఉదయ్, వట్టిమల్ల ప్రశాంత్, ఆడెటి తిరుపతి, మిట్టపెల్లి రాజేందర్, బొడుగం స్వామి, దొంగ జితేందర్, సాంబ గంగాధర్‌లు ఎన్నికయ్యారు. 44వ బూత్ అధ్యక్షుడిగా ఎనుగందుల రాకేష్‌ను నియమించారు. బీజేపీ సీనియర్ నాయకులు దొంగ లింగారెడ్డి, శివనీతి రమ్య కిష్టయ్య, కొల్ల రవి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎంపీ అర్వింద్

జగిత్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. గురువారం నిజామాబాద్ బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో జగిత్యాలలోని పోచమ్మవాడకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎంపీ అరవింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. నాయకులు మహేశ్, రమేశ్, రాజశేఖర్, రవి కుమార్, రాములు, సుబాష్, రంజిత్ తదితరులకు కండువాలను ఎంపీ అరవింద్ కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రదానీ నరేంద్ర మోదీ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్శితులై స్వచ్చందంగా పలువురు బీజేపీలో చేరుతున్నారన్నారు. మూడో పర్యాయం ప్రదానీగా మోదీ ఎన్నికయి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, పట్టణాధ్యక్షుడు రంగు గోపాల్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, నాయకులు బోగ ప్రవీణ్, కాశెట్టి తిరుపతి, అకుపత్తిని మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం

రాయికల్, ఏప్రిల్ 18: మండలంలోని అల్లీపూర్, కుమ్మరిపెల్లి గ్రామాల్లో గురువారం బీజేపీ నాయకులు గడప గడపకు బీజేపీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లీపూర్ గ్రామంలోని గ్రామ దేవత పోచ మ్మ ఆలయంలో పూజలు నిర్వహించి 50, 51 వార్డులలో మోడీతోనే అభివృద్ధి అనే కరపత్రాలు, వాల్ స్టిక్కర్‌లను ఇంటింటికీ పంచారు. కుమ్మరిపెల్లిలో 47, 48 బూత్‌లలో గడప గడపకూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పడాల తిరుపతి, మాజీ ఎంపీటీసీ ఉడుత రవీందర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఉడుత రామ్‌సురేష్, నాయకులు పరమేశ్వర్, రాజగోపాల్, మిట్టపెల్లి రాజేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

●మండలంలోని రామాజీపేట గ్రామంలో బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని నరేందర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మోడీ చేస్తున్న అభివృద్ధి గురించి వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు ఎనుగంటి నాగరాజు, ఇద్దాం గంగారెడ్డి, గ్రా మ నాయకులు కోల శంకర్, కంటె భూమేష్, రమేష్, స్వామి రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

బీర్‌పూర్: బీజేపీ చేపట్టిన శక్తి వందన్ అభ్యన్ కార్యక్రమంలో భాగంగా గురువారం బీర్‌పూర్ మండలంలోని బీర్‌పూర్, నర్సింహులపల్లి, తుంగూర్ గ్రామాలలో బీజేపీ జగిత్యాల నియోజకవర్గం ఇన్‌చార్జి బోగ శ్రావణి ఆధ్వర్యంలో మహిళలతో మాట్లాడారు. ఉపాధి కూలీలకు, బీడీ కార్మికులకు నరేంద్రమోదీ అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను గురించి వివరించారు. మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గేట్ల నిర్మాణంపై చిగురిస్తున్న ఆశలు..!

● అంచనాలు సిద్ధం చేస్తున్న ఎస్సారెస్పీ అధికారులు
● సుమారు రు. 500 కోట్ల వ్యయం

కథలాపూర్, ఏప్రిల్ 18 : మండలంలోని దమ్మన్నపేట, మన్నెగూడెం శివారులో వదల కాలువపై గేట్లు, పంప్‌హౌస్, సబ్‌స్టేషన్ నిర్మాణంపై ఆశలు చిగురిస్తున్నాయి. అంచనాలు రూపొందించే పనుల్లో అధికాఈరులు నిమ గ్నమయ్యారు. ఈ వేసవిలో వరద కాలువపై ఆధారపడి పంటలు సాగు చేసుకున్న రైతులకు ఇక్కట్లు ఎదురయ్యాయి. నీరు పూర్తిగా ఖాళీ కావడం వల్ల మండలంలోని సుమారు 10 గ్రామాల రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వేలాది ఎకరాల పంటల పరిస్థితి ప్రశ్నార్థకం కావ డంతో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో మూడు దఫాలుగా నీరు పైభా గం నుంచి విడు దల చేయించడం వల్ల ఎట్టకేలకు రైతులకు ఊరట లభించింది. ఈ పరిస్థితికి కారణం మధ్యలో గేట్లు ఏర్పాటు చేయక పోవడమేని రైతాంగం ఆరోపిస్తోంది.



వరదకాలువ

● గేట్లు, పంపుహౌస్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం

ప్రస్తుతం వరద కాలువపై రాజేశ్వర్‌రావు, రాంపూర్ వద్ద పంప హౌజ్‌లు ఉన్నాయి. వీటి మధ్య దూరం సుమారు 30 కిలోమీటర్ల మేర ఉండడంతో అధిక మొత్తంలో నీరు నిల్వ ఉండడానికి అవకాశం లేకుండా ఉందని రైతాంగం అభిప్రాయపడుతోంది. వానాకాలంలో పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకున్నా వేసవిలో సమస్య జటిలంగా ఉంటోంది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న పంపుహౌస్‌ల మధ్య మరో పంప్ హౌస్‌ను నిర్మించాలని రైతాంగం ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. దీంతో ఎస్ఆర్ఎస్‌పీ అధికారులకు అంచనాలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సంబంధిత అధికారులు దమ్మన్నపేట, మన్నెగూడెం శివారులో నూతనంగా గేట్లు, పంప్‌హౌస్, సబ్‌స్టేషన్ నిర్మాణం చేయడానికి అంచనాలు రూపొందించే పనుల్లో నిమగ్నమయ్యారు. వీటి ఏర్పాటుకు సుమారు రు. 500 కోట్ల వ్యయం కానుందని అధికారులు పేర్కొంటున్నారు.

● ఇక్కడి నుంచే సూరమ్మ చెరువుకు ఎత్తిపోతలు

గత ప్రభుత్వ హయాంలో కలికోట సూరమ్మ చెరువును నింపడానికి దుంపెట శివారులో పంప్‌హౌస్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే నిధులు ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఇప్పుడు గేట్లతో సహా పంపుహౌస్ నిర్మాణం చేపట్టడానికి కి చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నందు వల్ల రైతులకు రెండు విధాలుగా లాభం చేకూరేలా ఉందని అధికారులు వివరిస్తున్నారు. వేసవిలో కూడా పంటలకు ఢోకా ఉండదని ఆశాభావం వెలిబుచ్చుతున్నారు.



● గేట్లు ఏర్పాటు చేస్తేనే మేలు

గడ్డం జీవన్‌రెడ్డి, రైతు కథలాపూర్

రాంపూర్, రాజేశ్వర్‌రావు పంపుహౌజ్‌ల మధ్య దూరం ఎక్కువగా ఉన్నందు వల్ల మధలో ఉన్న రైతు లకు కొంత మేర అన్యాయం జరుగుతోంది. రబీ సీజన్‌లో నీరు నిల్వ ఉండక పంటలు చేతికొచ్చే దశలో ఎండి పోయే ప్రమాదం పొంచి ఉంటోంది. వేలాది రూపాయల పెట్టుబడులు నష్టపోయే అవకాశాలు ఉన్న క్రమంలో మధ్యలో గేట్లు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.



● ప్రభుత్వం చొరవ చూపితే న్యాయం

పిడుగు ఆనందరెడ్డి, రైతు బొమ్మెన

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సూరమ్మ చెరువును పంపుహౌస్ ఏర్పాటు చేసి నింపుతామని చెప్పి రైతులను మోసం చేసింది. స్వయంగా ముఖ్య మంత్రి హోదాలో కేసీఆర్ ఇక్కడి ప్రజాప్రతినిధులతో మాట్లాడి వరదకాలువ రైతులకు న్యాయం చేస్తామని ప్రకటించినా కార్య రూపం దాల్చలేదు. మన్నెగూడెం శివారులో గేట్లు ఏర్పాటు చేస్తే పెగ్గెర్ల, ఊట్‌పల్లి, దుంపెట, బొమ్మెన, భూషణరావుపేట, తక్కళ్లపల్లి, సిరికొండ గ్రామాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా పెరిగి పంటల సాగుకు ఢోకా ఉండదు. ప్రభుత్వం చొరవ చూపిలే న్యాయం జరుగుతుంది.

పార్టీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలి

నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మెట్‌పల్లి, ఏప్రిల్, 18 : కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయా లని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణానికి చెందని బీఆర్ఎస్ నాయకులు బర్ల సాయన్న, గోపిడి జీవన్‌రెడ్డి వారి అనుచరులతో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన గ్యారెంటీలను అమలు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్ధతు తెలిపి చేతు గుర్తుకు ఓటు వేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ మెంబర్ కల్వకుంట్ల సుజిత్‌రావు, జువ్వాడి కృష్ణారావు, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, కొమిరెడ్డి కరం, కొమిరెడ్డి విజయ్, తిప్పి రెడ్డి అంజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎండి షాకీర్, మహమ్మద్ కుతుబుద్దీన్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



పార్టీ చేరిన సాయన్నకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న జీవన్‌రెడ్డి

మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి

జగిత్యాల టౌన్, మార్చి 18: గుడుంబా తయారీ, గంజాయి, అక్రమ మద్యం రవాణా. అనధికార మద్యం దుకాణాల నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం షేడ్యూల్ విడుదల చేసిన నాటినుంచి ఇప్పటి వరకు జిల్లాలో 103 గుడుంబా నేరాలను గుర్తించి 17 మందిని అరెస్టు చేసి 350 లీటర్ల గుడుంబా, 21,320 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశామన్నారు. ఈ నేరాలకు ఉపయోగించిన ఏడు వాహనాలను సీజ్ చేశామన్నారు. ఆరు అనధికార మద్యం దుకాణాలను గుర్తించి ఐదుగురిపై కేసులు నమోదు చేసి 21.08 లీటర్ల లిక్కర్, 31.05 లీటర్ల బీరును సీజ్ చేశామని వివరించారు. ఎక్సైజ్ నేరాల ఫిర్యాదుకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఫోన్ నెంబర్ 8019108768ను సంప్రదించ వచ్చునన్నారు.

వదువుకు ట్రస్ట్ సభ్యుల చేయూత

కోరుట్ల, ఏప్రిల్ 18 : పట్టణంలోని ఓ నిరుపేద కుటుంబానికి చెందిన వదువుకు పట్టణానికి చెందిన మదర్ లవ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చేయూతను అందించారు. మేడిపల్లి మండలం గోవిందారం గ్రామానికి చెందిన మెగిల్ల భాగ్య క్రీ.శే శ్రీనివాస్ దంపతుల కుమార్తె ప్రియాంక ఈ నెల 24వ తేదీన వివాహం కానుండంగా నూతన వదువుకు ఇంటి పర్నీచర్‌ను అందించారు. బీరువా, పరుపులు, 2 కుర్చీలు, డ్రెసింగ్ టేబుల్‌ను కోరుట్ల పట్టణంలోని చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ నిర్వాహకుడు పోతుగంటి శ్రీనివాస్ అందించారు.

డిప్లామా పరీక్ష దరఖాస్తులకు ఆహ్వానం

కోరుట్ల, ఏప్రిల్ 18 : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కోరుట్లలో సివిల్, మెకానికల్ డిప్లొమాల ప్రవేశ పరీక్ష కొరకు దరఖాస్తూలు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ గురువారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు గడువు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పరీక్షలు కోరుట్ల, పట్టణ కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆశక్తిగల 10వ తరగతి చదివిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా అశ్విన్

మల్లాపూర్, ఏప్రిల్, 18 : మల్లాపూర్ పట్టణాధ్యక్షుడుగా సోమ అశ్విన్‌ను నియమించిన పత్రాలను మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమాకమైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడుగా గడ్డం నర్సారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిగా సరికేల్ల నర్సయ్యలకు పత్రాలను జిల్లా ఆదేశాల మేరకు నాయకులు అందజేశారు. అశ్వీన్‌ను నాయకులు, కార్యకర్తలు అభినందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ మహిళా మోర్చా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు లవంగ శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

కొడిమ్యాల, ఏప్రిల్ 18 : మండలంలోని నాచుపల్లి, రామరావుపేట అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే, స్కూల్ డే నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీడీపీవో నర్సింగరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలను పంపితె అన్నిరకాల అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రాడ్యుయేషన్ ప్రాముఖ్యతను వివరించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల వారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. అంగన్‌వాడీ నుంచి ప్రైమరీ పాఠశాలకు వెళ్లే వారికి సర్టిఫికెట్లను అందించారు. సూపర్‌వైజర్ ఉమ, నవాబుపేట పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు మాధవి, నాచుపల్లి కార్యదర్శి శేఖర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు

'ఎంపీగా జీవన్ రెడ్డిని గెలిపించాలి'

జగిత్యాల టౌన్, మార్చి 18: నిజామాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 20, 21 వార్డుల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 20, 21 వార్డు నాయకులు ఉన్నారు.

స్కూల్ వాహనాల తనిఖీలకు స్పెషల్‌డ్రైవ్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మల్యాల, ఏప్రిల్ 18: నేటి నుంచి విద్యార్థులను తరలించే స్కూల్ వాహనాలను తనిఖీలు చేపడుతున్నట్లు జిల్లా రవాణా అధికారి వంశీధర్ రావు తెలిపారు. మల్యాల మండలంలోని రామన్నపేటకు చెందిన ప్రైవేట్ స్కూల్ వ్యాన్ కింద పడి చిన్నారి మృతి చెందగా ఆ వ్యాన్‌కు ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఆంధ్రజ్యోతిలో బుధవారం 'ఇన్సూరెన్స్ లేని స్కూల్ వ్యాన్' కథనం ప్రచురితమైంది. దీంతో డీటీవో స్పందించారు. సదరు స్కూల్ వాహనం పత్రాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై కూడా తరచూ ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు డీటీవో వెల్లడించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా గల ప్రైవేట్ పాఠశాలల వాహనాలను తనిఖీలు చేయడానికి గాను స్పెషల్‌డ్రైవ్ నిర్వహణకు గురువారం ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సక్రమంగా పత్రాలు లేని వాహనాలపై చర్యలు తప్పవన్నారు. పాఠశాలల యాజమన్యాలు విద్యార్థులను తరలించే తమ వాహనాలకు ఇన్సూరెన్స్‌తో పాటు ఫిట్‌నెస్ తదితర అన్ని రకాల పత్రాలు, డ్రైవర్‌కు లైసెన్స్ తప్పని సరిగా ఉండేలా చూసుకోవాలని లేనిచో సీజ్ చేస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

జగిత్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరుగుదల జరపాల్సిన అవసరముందని జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జడ్‌పీహెచ్ఎస్ వెల్గొండ, ఎపీపీఎస్ వెల్గొండ పాఠశాల ఉపాధ్యాయులు వచ్చే విద్యా సంవత్సరం 2024-25లో విద్యార్థుల నమోదు, పెరుగుదలకు ము ద్రించిన వాల్ పోస్టర్లను, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్బంగా డీఈఓ జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థుల నమోదుకు ఉపాధ్యాయులందరూ ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లను ముద్రించిన వెల్గొండ పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు అమర్ నాథ్‌రెడ్డి, ఆనందరావు, జడ్‌పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు దశరథరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన చేపట్టాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

భీమారం, ఏప్రిల్ 18: వరిధాన్యం వెను వెం టనే తూకం వేసి కొనుగోళ్ల త్వరి తగతిన చేపట్టి రైస్‌మిల్లులకు తరలించాలని జగిత్యాల అడిషనల్ కలెక్టర్ రాంబాబు అన్నారు. మండలం లోని లింగంపేట సెర్ప్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం హమాలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. సెంటర్‌లో గల వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో త్రివేదిక, సెర్ప్ ఏపీఎం అశోక్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ యాదవ్, సీసీ మార్కెటింగ్, కొనుగోలు కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



ఆలయ మ్యాపును పరిశీలిస్తున్న స్తపతి

జగిత్యాల టౌన్, మార్చి 18: దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ స్తపతి వల్లి నాయగం అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణి నగర్, ప్రధాన కూరగాయల మార్కెట్‌లో ఉన్న రాజ రాజేశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలను స్తపతి గురువారం పరిశీలించారు. ఆలయాల పునఃనిర్మాణ పనులు చేపట్టడానికి కావాల్సిన వసతులును అడిగి తెలుసుకున్నారు. ఆలయాల మ్యాపులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

సీనియర్ ఈఈ మల్లికార్జున్‌రెడ్డి, వేములవా డ ఈఈ రాజేష్, అసిస్టెంట్ స్తపతి వెంకటేశ్వర్లు, ఆలయ ఈవో వేణుగోపాల్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

రాయికల్, ఏప్రిల్ 18: రైతులకు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని వ్యవసాయ విస్తరణ అధికారి మత్తయి పేర్కొన్నారు. మండలంలోని కుమ్మరి పెల్లి, శివాజీనగర్, రాయికల్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎ-గ్రేడ్ రకానికి రూ. 2203, సాధారణ రకానికి రూ.2183లు పొందవచ్చని తెలిపారు. ఆయన వెంట సొసైటీ సీఈవో తిరుపతి, ఇన్‌చార్జి దేవానందం, పవన్, గోపాల్ రెడ్డి ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం

రాయికల్, ఏప్రిల్ 18: రాయికల్ మండల బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన తునికి నాగరాజును నియమించినట్లు మండల అధ్యక్షుడు బండారి సాయిరాజ్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ సూచనల మేరకు నాగరాజును నియమించినట్లు తెలిపారు. బీసీ సంక్షేమం దిశగా సామాజిక రంగాల్లో నిరంతరం కృషి చేస్తున్న నాగరాజు సేవలు అభినందనీయమని అన్నారు.

కన్నులపండువగా సీతారాముల పట్టాభిషేకం



కోదండరామలయంలోని స్వామి వారికి పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు



నామాపూర్‌లో గీతా హవన యజ్ఞం

మెట్‌పల్లి, ఏప్రిల్, 18 : పట్టణంలోని కోదండ రామాలయంలో సీతారాముల మహా పట్టాభిషేక మహోత్సవ వేడుకను పురోహితులు కనులపండువగా జరిపారు. గురువారం ఆలయంలో స్వామి వారికి పురోహితులు రమకాంత్‌చారి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీరామ నవమి పురస్కరించుకోని స్వామి వారి కల్యాణ ఘట్టంలో భాగంగా సీతారాముల పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహకులు చేపట్టారు. ఉత్సవ మూర్తులను ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సింహాసనంపై సీతమ్మతో స్వామివారిని ఏర్పాటు చేశారు. పురోహితులు వేద మంత్రోత్సవాల మధ్య సీతారాముల పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షపరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించి స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ మహాజన్ నర్సింలు, శ్రీనివాస్‌చారి, ఆర్మూర్ పోచయ్య, పర్మి నర్సయ్య, భక్తులు, హనుమాన్ దీక్షపరులు, పాల్గొన్నారు.

పెగడపల్లి : మండలంలోని ఎల్లాపూర్ సీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం శ్రీరాముడి పట్టాబిషేక వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాలలో బాగంగా మండలంలోని ఎల్లాపూర్, నామాపూర్, నంచర్ల, ఆయిత్‌పల్లి గ్రామాలలోని రామాలయాలలో రెండవ రోజున ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఎల్లాపూర్ రామాలయంలో జరిగిన వేడుకలకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై పట్టాబిషేకం వేడుకలలో పాల్గొన్నారు. నామాపూర్‌లో రోటిగూడెం మౌనస్వామి ఆధ్వర్యంలో అష్టాదశ హోమగుండ ములతో గీతా సంపూర్ణ హవన యజ్ఞం, భగవత్ గీత పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు, మండల కాంగ్రెస్ నాయకులు రాములు గౌడ్, ఒరుగల శ్రీనివాస్, సంది మల్లారెడ్డి, అమి రిశెట్టి లక్ష్మీనారాయణ, రంగు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.